
సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 7 ఏప్రిల్ । 2023



పల్లెకు పర్యాటక శోభ 8లో▸

బెస్ట్ విలేజ్ టూరిజం ఎంపికకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఒక్కో జిల్లా నుంచి మూడు పర్యాటక కేంద్రాలను గుర్తించి రాష్ట్ర టూరిజం శాఖకు పంపించాల్సి ఉంటుంది.



'భట్టి' పాదయాత్రకు విరామం

సీఎల్పీ నేత జిల్లాలో చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్రకు స్వల్ప విరామం ప్రకటించారు. మంచిర్యాల బహిరంగ సభ వాయిదా నేపథ్యంలో నజీర్‌పల్లిలోనే బస చేయనున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.



న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి ఉన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం పరిశీలించారు. ప్రశ్నపత్రాల లీకేజీల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ టి.సంజీవ్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

పన్ను బకాయిలు వసూలు చేయాలి



ఆర్డీఎంఏను సన్మానిస్తున్న కమిషనర్

లక్సెట్టిపేట: ఆస్తి పన్ను బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని వరంగల్ ఆర్డీఎంఏ షాహిద్ మసూద్ సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ పన్నుల వసూలులో రాష్ట్రంలో మూడో స్థానంలో ఉందని, మొదటి స్థానంలోకి వచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఇంటిపన్నులు ఇప్పటివరకు చెల్లించని వారి నుంచి వసూలుకు కృషి చేయాలని కోరారు. ఇంటి నంబరు లేని ఇళ్లకు నంబర్లు పంపిణీ చేయాలని, పన్నులు చెల్లించేందుకు తెలియపర్చాలని అన్నారు. బిల్లు వసూలులో 94శాతం పూర్తి చేసినందుకు బిల్ కలెక్టర్లను అభినందించారు. అనంతరం ఆర్డీఎంఏను మున్సిపల్ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ శ్రీహరి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పర్యటనపై నిరసనకు పిలుపు

శ్రీరాంపూర్: ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని కార్మికులు, యూనియన్ శ్రేణులకు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణిలోని నాలుగు బొగ్గుబ్లాకులను కేంద్రం వేలం వేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని పేర్కొన్నారు. మోదీ కార్మిక వ్యతిరేకి అని, 11వ వేజ్‌బోర్డును వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'రాష్ట్రంలో నిరంకుశ పాలన వచ్చే ఎన్నికల్లో అంతం'



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశ పాలనను వచ్చే ఎన్నికల్లో ప్రజలు అంతమొందిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అర్చనటెక్స్ చౌరస్తాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీలు ప్రభుత్వ ఫలాలు ప్రతీ ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో జనసంఘ్‌ను స్థాపించారని, వారి ఆశయ సాధనే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు రజనీష్ జైన్, తాజ్‌ఖాన్, మల్యాల శ్రీనివాస్, జోగుల శ్రీదేవి, రాజమౌళి, అమిరిశెట్టి రాజు, గాజుల ప్రభాకర్, నాగుల రాజన్న, బింగి సత్యనారాయణ పాల్గొన్నారు.

షికారీ ఆగితే పులికి బతుకు!



మంచిర్యాల జిల్లా శివ్వారం అడవుల్లో విద్యుత్ కంచెకు బలైన రాయల్ బెంగాల్ టైగర్(ఫైల్)

- విద్యుత్ తీగలతో ప్రాణాలకు ముప్పు
- వేసవిలోనూ యథేచ్ఛగా అడవిలో వేట
- ఈ ఏడాది రెండు పులుల మరణాలు వెలుగులోకి..
- జాతీయ జంతువుకు తప్పని ప్రాణగండం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అడవిలో వేట పూర్తిగా ఆగితేనే జాతీయ జంతువు పులికి భద్రత లభిస్తుంది. ఈ ఏడాది కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో రెండు పులుల మరణాలు వెలుగులోకి రావడం ముప్పును తెలియజేస్తోంది. నెన్నెల మండలం కుశ్నపల్లి రేంజ్‌లో పులి అవశేషాలు బయటపడడం తెలిసిందే. రెండ్రోజుల క్రితం మహారాష్ట్ర పరిధి జివితి తాలూకాలో కుమురంభీం జిల్లాలో సంచరించిన ఓ పులిని హతమార్చి చర్మం విక్రయిస్తుండగా అక్కడి అటవీ అధికారులు పట్టుకున్నారు. ఈ వరుస ఘటనలతో కవ్వాల్ టైగర్‌జోన్‌లో పులుల భద్రతను ప్రశ్నిస్తున్నాయి. పులులు చనిపోయిన నెలల తర్వాత వాటి అవశేషాలు విక్రయిస్తున్న క్రమంలోనే ఈ ఉదంతాలు బయటకు వస్తున్నాయి. పులి ట్రాకింగ్ వ్యవస్థ స్పష్టత లేక ఏ పులి ఎక్కడ సంచరిస్తుందో తెలియక కనిపించకుండా పోతున్నాయి. ఇలాంటి జాడ లేకుండా పోయిన పులులు ఉన్నాయి. చాలావరకు మహారాష్ట్ర వెళ్లిపోయాయని చెబుతున్నప్పటికీ వాస్తవానికి అవి ఎక్కడున్నాయో స్పష్టత లేదు. అడవిలో వన్యప్రాణుల వేట కోసం అమర్చుతున్న విద్యుత్ తీగలతోనూ పులులకు ముప్పు వాటిల్లుతోంది. గతంలో అటవీ ప్రాంతాల వరకు విద్యుత్ సదుపాయం ఉండకపోవడంతో ఉరిలు మాత్రమే వేసేవాళ్లు. అడవి పందులు, దుప్పులు, ఏదులు, మెకం వంటి జంతువులను వేటాడేందుకు ఏకంగా 32కేవీ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ లైన్ల నుంచి దొంగచాటుగా అడవి లోనికి ప్రసారం చేస్తూ వాటి ప్రాణాలు తీస్తున్నారు. ఇప్పటికీ అటవీ సమీప ప్రాంతాల్లో యథేచ్ఛగా వేట కొనసాగుతోంది.

జాతీయ జంతువుకు గండం

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, అంధేరి పులుల సంరక్షణ కేంద్రాల్లో వాటి సంతతి పెరిగి కవ్వాల్‌లోకి అడుగు పెడుతున్నాయి. ఆహారం, ఆవాసం, తోడు కోసం ఇటు వైపు వస్తున్నాయి. ఇలా వచ్చిపోయే వలస పులులతోపాటు కవ్వాల్ పరిధిలో స్థిర నివాసం ఏర్పర్చుకున్న వాటికి ముప్పు పొంచి ఉంది. అటవీ సమీప ప్రాంతాల ప్రజలకు జాతీయ జంతువుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతోపాటు పులులు వస్తే పాటించాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు వివరించడం లేదు. ఒక్కోసారి పులి వచ్చిందని చెప్పినా అటవీ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంతోనూ సమస్యలు వస్తున్నాయి. గతంలో ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల పరిధిలో పులి సంచరిస్తోందని అక్కడి అధికారులకు చెబితే ఈ ప్రాంతంలో పులి లేదని కొట్టిపారేశారు. రెండ్రోజులకే అక్కడ ఓ రైతుపై దాడి చేసి ప్రాణాలు తీసింది. పులి భద్రత పేరుతో గోప్యత పాటించి అసలుకే మోసం తెస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక రాత్రి వేళ కరెంటు సరఫరా, తనిఖీలు, గస్తీ, యానిమల్ ట్రాకర్స్ ఉన్నప్పటికీ పులికి ప్రాణగండం తప్పడం లేదు.

వేసవిలోనూ వేటగాళ్ల ముప్పు



వేసవిలో వన్యప్రాణులు అడవిలో నుంచి వేడిని తట్టుకునేందుకు, నీరు, ఆహారం కోసం బయటకు వస్తుంటాయి. ఈ క్రమంలో వేటగాళ్లు షికారీ చేస్తూ అటవీ జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. వానాకా లంలో పత్తి పంటను కాపాడుకునేందుకు అడవి పందుల నియంత్రణకు విద్యుత్ తీగలతో కంచెలు వేస్తుంటారు. ఆ సమయంలో ఏ జంతువు తగిలినా ప్రాణాలు కోల్పోతాయి. వేసవిలో నీటికుంటలు, ఒర్రెలు, లోయలు, వెదురు చెట్ల చల్లదనం కోసం వచ్చే క్రమంలో వేటగాళ్లు ఉచ్చులు వేసి ప్రాణాలు తీస్తున్నారు. దీనిపై పకడ్బందీగా ప్రణాళిక వేసి అమలు చేస్తే గానీ అటవీ జంతువులకు రక్షణ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'పది'ంతల నిఘా



ట్రినిటీ హైస్కూల్ పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

- పరీక్ష కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం
- పోలీసు, మున్సిపాలిటీ, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ
- ఎస్కార్ట్‌తో జవాబు పత్రాల తరలింపు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనల నేపథ్యంలో నిఘా పెంచారు. మునుపెన్నడూ లేని విధంగా పరీక్షల పర్యవేక్షణకు పోలీసులతోపాటు మున్సిపాల్టీ, రెవెన్యూ ఉద్యోగులను నియమించారు. గురువారం కొన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై స్థాయి అధికారితోపాటు ఇద్దరేసి కానిస్టేబుళ్లను నియమించారు. మొబైల్ పార్టీ బృందాలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాయి. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ నేతృత్వంలో ఏసీపీ తిరుపతిరెడ్డి కేంద్రాలను పర్యవేక్షించారు. సీఐ, ముగ్గురు ఎస్సైలు, 30మంది కానిస్టేబుళ్లను పరీక్ష విధులకు కేటాయించారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షలు ముగిసిన అనంతరం పోలీసు ఎస్కార్ట్ మధ్య జవాబు పత్రాలను పోస్టాఫీసులకు చేర్చారు.

99.35శాతం హాజరు..

జిల్లాలో ఇంగ్లిష్ పరీక్షకు 99.35శాతం విద్యార్థులు హాజరయ్యారు. 55 పరీక్షా కేంద్రాల్లో 10,114 మంది విద్యార్థులకు గాను 10,048 మంది పరీక్షలు రాశారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 10,090 మందికి గాను 10,033 మంది హాజరుకాగా 57 మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు 24 మందికి గాను 15 మంది హాజరయ్యారు.



ఎస్కార్ట్ మధ్య పోస్టాఫీస్‌కు చేరిన జవాబుపత్రాలు

కలెక్టర్ తనిఖీ

జిల్లా కేంద్రం మంచిర్యాలలో పలు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మెల్ హైస్కూల్, ట్రినిటీ హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి, కార్మెల్ హైస్కూల్‌తోపాటు పలు కేంద్రాలను సందర్శించారు. డీఈవో వెంకటేశ్వర్లు 5, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంటు ఎగ్జామినేషన్ దామోదర్‌రావు 2, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 26 పరీక్షా కేంద్రాలను పరిశీలించాయి. పరీక్షలు సజావుగా సాగినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

పాఠ్యపుస్తకాలు వచ్చాయోచ్

- బడులు తెరిచేనాటికి విద్యార్థుల చేతుల్లోకి..
- గుడిపేట్‌లోని బుక్‌డిపోకు సరఫరా

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు జిల్లా బుక్‌డిపోకు చేరాయి. వేసవి సెలవుల్లోనే గుడిపేటలోని బుక్‌డిపోకు సరఫరా అవుతుండగా.. బడులు తెరిచే నాటికి విద్యార్థుల చేతికి అందనున్నాయి. వారం రోజులుగా నాలుగు ఆర్టీసీ లాజిస్టిక్(కార్గో) సర్వీసు ద్వారా పుస్తకాలు చేరుతున్నాయి. ఇప్పటికే 87 వేల పుస్తకాలు చేరినట్లు విద్యాశాఖ ప్రకటించింది. గత ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తి స్థాయి పాఠ్య పస్తుకాలు సరఫరా కాకపోవడంతో విద్యార్థులు అరకొర పుస్తకాలతోనే బడిబాట పట్టారు. వచ్చే విద్యాసంవత్సరం బడులు తెరిచే నాటికే పుస్తకాలు అందించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 861 పాఠశాలలు ఉండగా 66,409 మంది విద్యనభ్యసిస్తున్నారు. సర్కారు బడుల్లోని విద్యార్థులకు 4,20,000 పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 87వేల పుస్తకాలు మాత్రమే బుక్‌డిపోకు చేరాయి. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు పాఠ్య పుస్తకాల సరఫరాకు టెండర్ల ఖరారులో కూడా జాప్యం కాకుండా చర్యలు చేపట్టనున్నారు. పుస్తక విక్రయ కేంద్రం నుంచి పాఠ్య పుస్తకాలను మండల పాయింట్లకు సరఫరాకు ముందస్తుగా టెండర్ ప్రక్రియ నిర్వహించి అక్కడి నుంచి పాఠశాలకు చేరవేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

పుస్తకాల సరఫరాలో జాప్యం

గత ఏడాది పాఠ్య పుస్తకాల సరఫరాలో జాప్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మొదట్లో వచ్చిన 11శాతం పాఠ్య పుస్తకాల్లో కూడా ఏ ఒక్క తరగతికీ అన్ని పుస్తకాలు సరఫరా కాలేదు. 1, 2, 3వ తరగతుల పుస్తకాల ఊసే లేకుండా పోయింది. తెలుగు మీడియంకు చెందిన 9వ తరగతి గణితం, బయోసైన్స్, 4వ తరగతి గణితం, 7వ తరగతి సైన్స్, 6వ తరగతి గణితం, 8వ తరగతి సోషల్, ఇంగ్లిష్ మీడియంలో సోషల్, సైన్స్, ఇంగ్లిషు పుస్తకాల సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆంగ్లమాధ్యమం ప్రారంభించిన నేపథ్యంలో గణితం, సోషల్, జనరల్ సైన్స్ పుస్తకాల్లో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో పుస్తకం ముద్రించాల్సి రావడం.. ఈ పుస్తకాల్లో పార్ట్-1, పార్ట్-2 కింద ముద్రించి విడతల వారీగా సరఫరా చేయడంతో జాప్యం జరిగింది. పార్ట్-1కు సంబంధించి 6, 7, 8వ తరగతుల గణితం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు సంబంధించి ఒకే పుస్తకంలో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ముద్రించిన కొన్ని పుస్తకాలు ఆలస్యంగా విద్యార్థులకు చేరడంతో బోధనకు ఆటంకం కలిగింది. ఈ ఏడాది బడులు తెరిచేనాటికి పాఠశాలలకు పుస్తకాలు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.



బుక్‌డిపోలో పాఠ్య పుస్తకాలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

- పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు
- భద్రత ఏర్పాట్లపై సీపీ రెమా రాజేశ్వరి సమీక్ష

మంచిర్యాలక్రైం: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం ఆమె భద్రత ఏర్పాట్లపై కమిషనరేట్ పరిధిలోని పోలీసు, విద్యాశాఖ అధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సరే.. ఎంతటి వారైనా సరే పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు ఇన్విజిలేటర్‌తోపాటు ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ వంద మీటర్ల దూరం వరకు ఎవరినీ లోపలికి రానివ్వకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని తెలిపారు. కేంద్రాల పరిధిలో విధిగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, ఏమరుపాటుగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విజయయాత్రలో కాషాయజెండాలతో మహిళలు, యువకులు



శోభాయాత్రలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ, బజరంగ్‌దళ్ నాయకులు

నేత్రపర్వంగా హనుమాన్ శోభాయాత్ర

మంచిర్యాలఅర్బన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంచిర్యాలలో గురువారం బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరహనుమాన్ విజయయాత్ర నేత్రపర్వంగా సాగింది. యాత్రను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. పార్టీలకతీతంగా యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనంపై హనుమాన్ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుంచి వేంకటేశ్వర టాకీస్ మీదుగా ముఖరాం చౌరస్తా, పట్టణ వీధుల్లో సాగింది. యువకుల నృత్యాలు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. హిందు సేవక్ సమాజ్ ఆధ్వర్యంలో అల్పాహారం, నడిపెల్లి చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ విజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శశికిరణ్, ఉపాధ్యక్షుడు మొగిలయ్య, కోశాధికారి పాదం రవీందర్, నగర కార్యదర్శి వేముల రమేష్, సహ కార్యదర్శి విష్ణు, రవీందర్, బోయిన రవి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు ప్రజలను తరలించాలి

- ఒక్కో నియోజకవర్గం నుంచి 300 మంది
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రతీ నియోజకవర్గం నుంచి 300 హాజరయ్యేలా చూడాలని, ఇందుకోసం ఆరు చొప్పున బస్సులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలను తరలించాలని, రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్ తన చాంబర్‌లో అధికారులతో సమావేశం అయ్యారు. విగ్రహావిష్కరణకు తరలివెళ్లే ప్రజల వివరాలు సేకరించాలని, భోజనం, తాగునీరు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గొర్రెల యూనిట్ల లబ్ధిదారుల వివరాలు సేకరించాలని అన్నారు. జిల్లాలో 4,132 యూనిట్లు లక్ష్యం కాగా 1,574 మంది లబ్ధిదారులు రూ.43,750 పెట్టుబడి బ్యాంకులో జమ చేశారని, మిగతా 2,558 మంది సొమ్ము చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా పశువైద్యాధికారి రమేష్, జెడ్పీ సీఈవో నరేందర్, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి పాల్గొన్నారు.



పాల్గొన్న జిల్లా కలెక్టర్ సంతోష్, అధికారులు

బహిరంగ సభ విజయవంతం చేయండి

నస్పూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న నస్పూర్‌లోని టవర్స్ ఎదురుగా ఖాళీ స్థలంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన నస్పూర్‌లోని సభాస్థలి వద్ద విలేకరులతో మాట్లాడారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా లక్ష మందితో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్ ఠాక్రే, పీసీసీ అ ధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తదితరులు హాజరవుతా రని తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీ రాష్ట్ర ఉ పాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, సెక్రెటరీ అంజద్, ఏఐసీసీ సభ్యుడు ప్రేంసాగర్‌రావు, పట్ట ణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్ సురిమిల్ల వేణు, నాయకులు శీపతి మల్లేశ్, సంపత్‌రెడ్డి, ఖలీద్ పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గూడెంలో పౌర్ణమి జాతర



సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం చైత్రపౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులు ఉదయం పూటనే అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 182 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. ఆలయం వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

విద్యార్థుల జీవితాలతో 'బండి' చెలగాటం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- ఎంపీ సంజయ్ దిష్టిబొమ్మ దహనం

బెల్లంపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. పదో తరగతి ప్రశ్నపత్రాలను లీక్ చేశారని ఆరోపిస్తూ కాంటా చౌరస్తాలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ ప్రశ్నపత్రాల లీకేజీతో విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యారని, ప్రభుత్వంపై దురుద్దేశ్యాన్ని ఆపాదించడం కోసం ఆ తీరుగా వ్యవహరించారని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి పనికిమాలిన చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని విమర్శించారు. సంజయ్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆయనను ఎంపీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఎంపీపీ శ్రీనివాస్, కౌన్సిలర్లు సురేష్, ఆస్మా, కృష్ణ, అశోక్, మధు, రామునాయక్, రమేష్, బి.నారాయణ, కో ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు యూనుస్, ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సత్యవతి పోరండ్ల తదితరులు పాల్గొన్నారు.



సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

బాలికను వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

భీమారం(చెన్నూర్): మంచిర్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన బాలికను లైంగికంగా వేధించిన అదే గ్రామానికి చెందిన తువ్వ రాజన్నకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల మొదటి తరగతి సెషన్స్ కోర్టు జడ్జి మైత్రేయి గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. 2020 అక్టోబర్ 24న బాలిక తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో 12 మంది సాక్షులను హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో నిందితునికి జైలుశిక్ష తోపాటు నగదు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఈతచెట్టు పైనుంచి పడి గీత కార్మికునికి గాయాలు


కిందపడ్డ లక్ష్మణ్‌గౌడ్

జన్నారం(ఖానాపూర్): మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు నేరెళ్ల లక్ష్మణ్‌గౌడ్ గురువారం ఈత చెట్టు పైనుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. నిచ్చెన సాయంతో ఈత చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా నడుంకు కట్టిన తాడు తెగిపోవడంతో కింద పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ కోరారు.

పల్లెకు పర్యాటక శోభ!

- బెస్ట్ విలేజ్ టూరిజం ఎంపికకు కసరత్తు
- ఒక్కో జిల్లా నుంచి మూడు పర్యాటక కేంద్రాలు గుర్తింపు
- జాతీయస్థాయిలో ఎంపికైతే ప్రత్యేక గుర్తింపు


జైపూర్ మండలం శివ్వారం సమీపంలోని ఎల్‌మడుగు


బెల్లంపల్లిలోని బుగ్గ దేవాలయం


దండేపల్లిలోని పెద్దయ్య దేవుడి ఆలయం

లక్సెట్టిపేట(మంచిర్యాల): కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రకటించిన రిజిస్ట్రేషన్ ఫారం ఫర్ బెస్ట్ టూరిజం విలేజ్ కాంపిటేషన్ ఆఫ్ ఇండియా కోసం తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ వారు జిల్లాలోని రూరల్ పర్యాటక కేంద్రాల ఎంపికకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఒక్కో జిల్లాకు మూడు బెస్ట్ టూరిజం ప్రదేశాలను ఎంపిక చేసి రాష్ట్ర టూరిజం శాఖ వారికి పంపించాల్సి ఉంటుంది. మూడింటిలో ఒకటిని ఎంపిక చేసి జాతీయస్థాయికి పంపిస్తారు. అన్నిరాష్ట్రాల నుంచి వచ్చిన వాటిని అధికారులు పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలుగా గుర్తించి బెస్ట్ టూరిజం ప్రదేశంగా ప్రకటిస్తారు. ఇందుకోసం పర్యాటక శాఖ అధికారులు మంచిర్యాల జిల్లాలోని పలు ప్రదేశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఎంపిక విధానం ఇలా..

జాతీయస్థాయిలో బెస్ట్ టూరిజం ప్రదేశంగా ఎంపిక కోసం గ్రామీణ స్థాయిలో బెస్ట్ టూరిజంగా ఉండే వాటికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇందుకోసం ఫిబ్రవరి 16న మినిస్ట్రీ ఆఫ్ టూరిజం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15వ తేదీలోగా అన్ని వివరాలు, ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి నుంచి వచ్చిన వాటి పరిశీలన మే 15లోపు కొనసాగుతుంది. జూన్ 15 వరకు రాష్ట్రస్థాయి పరిశీలన జరుగుతుంది. జాతీయస్థాయిలో పరిశీలించిన అనంతరం జూలై 15న ఉత్తమ టూరిజం ప్రదేశాన్ని ఎంపిక చేస్తారు. ముఖ్యంగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలంటే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రత్యేకత, చారిత్రాత్మకత, ప్రధాన వృత్తులు, ప్రాచీన కట్టడాలు, సంస్కృతి, వింత ఆకృతులు, ఆచారాలు, చేతివృత్తులు, తదితర అంశాలపై ప్రత్యేకత ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకోసం బెల్లంపల్లిలోని బుగ్గనీటి ప్రవాహం, చెన్నూర్‌లోని ఎల్‌మడుగు, లక్సెట్టిపేటలోని చిన్నయ్య గుట్ట, దండేపల్లిలోని పెద్దయ్య గుట్టలను ఎంపిక చేసారు. వీటిలో నుంచి మూడింటిని ఎంపిక చేసి జాతీయస్థాయికి పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి కృషిచేస్తే ప్ర జలు, పర్యాటకులకు అన్నివిధాల ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక ప్రదేశాలు గుర్తిస్తున్నాం



మినిస్ట్రీ ఆఫ్ టూరిజంశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను గుర్తిస్తున్నాం. మంచిర్యాల జిల్లాలోని కొన్ని ప్రదేశాలను గుర్తించి గడువు తేదీలోగా పంపించేందుకు కృషి చేస్తున్నాం.
– శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి, మంచిర్యాల

అన్నం తినేందుకు వెళ్తూ అనంతలోకాలకు..


ఘటనాస్థలంలో గంగారాం మృతదేహం

- ప్రమాదవశాత్తు బస్సు ఢీకొని కండక్టర్ మృతి
- మంచిర్యాల ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఘటన
- మృతుడు ఆదిలాబాద్ డిపోకు చెందిన కండక్టర్


గంగారాం (ఫైల్)

మంచిర్యాలక్రైం/ఆదిలాబాద్: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్టీసీ కండక్టర్ అన్నం తినేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు బస్సు టైరు కిందపడి మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం భరంపూర గ్రామానికి చెందిన బాతూరి గంగారాం (54) ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం ఉదయం ఆదిలాబాద్ నుంచి బయలుదేరగా 10:50 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇంకా 15, 20 నిమిషాల టైం ఉండడంతో డ్రైవర్ బస్సును పాయింట్ మీద నిలిపారు. కండక్టర్ గంగారాం భోజనం చేసేందుకు టిఫిన్ బాక్స్ పట్టుకుని డిపోలోకి వెళ్తున్నాడు. అప్పటికే హైదరాబాద్ నుంచి వచ్చిన సూపర్ లగ్జరీ బస్సు డిపో లోపలికి వెళ్లేందుకు సెక్యూరిటీ గది ముందు ఆగి ఉంది. డ్రైవర్ వాసాల తిరుపతి కుడి వైపు ఉన్న కార్యాలయంలోని సెక్యూరిటీ అధికారులతో మాట్లాడుతున్నాడు. ఎడమవైపు నుంచి వచ్చిన గంగారాం లోనికి వెళ్తుండగా గమనించని డ్రైవర్ తిరుపతి బస్సును స్టార్ట్ చేశాడు. బస్సు ముందుకు కదలడంతో ఎడమవైపు నుంచి వచ్చిన గంగారాంను ఢీకొట్టింది. కండక్టర్ కిందపడిపోవడంతో గమనించకుండానే డ్రైవర్ బస్సును ముందుకు తోలడంతో వెనుకటైరు గంగారాం తల మీదినుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన ప్రయాణికులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు కంటతడి పెట్టుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై తైసినొద్దీన్ ప్రమాద వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య పద్మ, కుమారుడు మనోజ్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్ తొందరపాటే ప్రమాదానికి కారణమా?

మంచిర్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి వచ్చింది. డిపోలో బస్సును అప్పగించి ఇంటికి వెళ్లాలన్న డ్రైవర్ తొందరపాటే ప్రమాదానికి కారణమైందని ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. బస్సు కిందపడిన కండక్టర్ అరుపులు విని డ్రైవర్ అప్రమత్తమై ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదని ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు.



ఆటలు ఆడేదెలా?

- క్రీడా ప్రాంగణాల్లో కానరాని సౌకర్యాలు
- చెరువు కట్టలు, ఊరికి దూరంగా ఏర్పాటు
- నిరుపయోగంగా క్రీడా మైదానాలు


కన్నెపల్లి మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం

నెన్నెల(బెల్లంపల్లి): యువతను క్రీడల్లో ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో వసతులు లేక క్రీడా ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి. పేరుకే అన్నట్లుగా బోర్డులతోనే సరిపెడుతున్నాయి. కొన్నిచోట్ల మొరం వేసి చదును చేయిస్తే మరికొన్ని చోట్ల బోర్డులు అమర్చి మమ అనిపించారు. సర్కారు బడులు, చెరువు కట్టలే క్రీడాప్రాంగణాలుగా వెలిశాయి. ఊరికి దూరంగా.. అడవికి దగ్గరగా ఉండడంతో యువత అటువైపు వెళ్లడం లేదు. క్రీడాప్రాంగణాల పరిస్థితి చూస్తే ప్రభుత్వ నిధులు నీళ్లపాలు చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారేమో? అన్నట్లుగా ఉంది.

548 క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 310 గ్రామ పంచాయతీల్లో 548 క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.2 లక్షలకు పైగానే ఖర్చు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు 379 క్రీడా ప్రాంగణాలు మాత్రమే పూర్తి అయ్యాయి. మిగతా చోట్ల స్థల సేకరణ కోసం అధికారులు పరిశీలన చేస్తున్నారు. దీంతో యువత, క్రీడాకారుల్లో అసంతృప్తి నెలకొంది. క్రీడా ప్రాంగణాల్లో కనీసం ఐదారు ఆటలైనా ఆడేలా స్థలం ఉండాలి. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాల్లో కేవలం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో ఏదైనా ఒకటే ఆట ఆడేందుకు వీలుగా ఉంటున్నాయి. అక్కడో బోర్డు పెట్టి ఇదే క్రీడా ప్రాంగణం.. ఇక్కడే ఆడుకోవాలని చెబుతున్నారు. చెరువు కట్టలు, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో ఆటలు సాగేదెలా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

స్థలాన్ని బట్టి వసతులు



గ్రామస్తుల కోరిక మేరకే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయించాం. ఏదైనా ఒక ఆట ఆడేందుకు వీలుగా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నాం. స్థలాల విస్తీర్ణాన్ని బట్టి వసతులు కల్పిస్తున్నాం. ప్రాంగణాలు లేకపోతే విద్యార్థులకు క్రీడా సామగ్రి రాదనే కారణంతో బోర్డులు పెడుతున్నాం. ఎక్కడైనా స్థలం ఉండి వసతులు లేకపోతే తప్పకుండా అక్కడ క్రీడా వసతులు కల్పిస్తాం.
– శేషాద్రి, డీఆర్‌డీవో, బెల్లంపల్లి

ఖైరిగూడ ఓసీపీని ప్రైవేటు నుంచి కాపాడాలి


ధర్నా చేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ ప్రైవేటుపరం కాకుండా చూడాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. ఓసీపీలో ప్రైవేటు సంస్థ ద్వారా కాకుండా కార్మికుల ద్వారా బొగ్గు తీయాలని డిమాండ్ చేస్తూ గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు సరిగా పనిచేయటం లేదని ప్రైవేటు సంస్థ ద్వారా బొగ్గు తీయించడాన్ని తప్పుపట్టారు. ఓసీపీలోని మిడిల్ సీమ్, బాటమ్ సీమ్‌లో బొగ్గు తీసేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారులు పనికి తగిన మిషనరీ అందుబాటులో ఉంచకపోవడంవల్లే బొగ్గు వెలికితీత ఆలస్యం అవుతోందన్నారు. హాల్‌రోడ్స్, మిషనరీ, మ్యాన్‌పవర్‌ను ఏర్పాటు చేస్తే టార్గెట్ సాధించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. టీబీజీకేఎస్ చేతకాని తనం మూలంగానే గోలేటి-1, 1ఏ, అండర్ గ్రౌండ్ మైన్స్‌తో పాటు ఎక్స్‌ప్లోరేషన్ విభాగాలు మూసివేశారని, ఖైరిగూడ ఓసీపీని సైతం ప్రైవేటుకు అప్పగించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. అనంతరం ఎస్‌వోటూ జీఎం గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు ఓజియార్, జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా నాయకులు ఇనూస్, రమేశ్, శ్రీనివాస్, వినయ్, శ్రీనివాస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత ‘హైదరాబాద్’


హైదరాబాద్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న జీఎం


రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన 34వ వేణుగోపాల్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ గురువారంతో ముగిశాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి 12 జట్ల క్రీడాకారులు పోటీల్లో తలపడగా గురువారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో కరీంనగర్, హైదరాబాద్ జట్లు హోరాహోరీగా తలపడగా 2–0 పాయింట్లతో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ జట్టుకు రూ.50వేల నగదు పారితోషికం పాటు షీల్డ్, ద్వితీయస్థానంలో నిలిచిన కరీంనగర్ జట్టుకు రూ.30వేల నగదుతో పాటు షీల్డ్‌ను జీఎం దేవేందర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, స్పోర్ట్స్ పర్యవేక్షకుడు సురేందర్ రాజు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.











8న నిరసన విజయవంతం చేయాలి

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణిలో ఈ నెల 8న చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి కోరారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యాటనను వ్యతిరేకిస్తూ సింగరేణిలోని అన్ని ఏరియాల్లో గనులు, డిపార్టుమెంట్లలో బొగ్గుగని కార్మికులు నిరసన తెలపాలన్నారు. సమావేశంలో నాయకులు దాసరి తిరుపతి గౌడ్, మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

11న వాహనాల వేలం

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 11న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సాయిబాబ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు నేరాలలో పట్టుబడిన 11 ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన సూచించారు.

పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలి


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాల అర్బన్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయం, అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని గ్రంథాలయ పాలకులకు సూచించారు.

‘ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి’


నిరసన తెలుపుతున్న తపస్ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, ప్రతీనెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, వేసవిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయింపు శ్రీనివాస్, బగ్గని రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

నస్పూర్(మంచిర్యాల): సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఓ వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. పట్టణంలోని బంగ్లాస్ ఏరియా పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్కుర్ల రవితేజపై అనుమానం వచ్చి అతన్ని తనిఖీ చేయగా సుమారు 80 గ్రాముల గంజాయి లభించింది. భీమిని మండలం జనకపూర్‌కు చెందిన రవి తేజ సీసీసీలో అతని బావ దగ్గర ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గంజాయిని స్వాధీ నం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హనుమాన్ జయంతి


ప్రత్యేక పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్

మందమర్రిరూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్‌లోని హనుమాన్ టెంపుల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

ఆస్తి తగాదా కేసులో ఐదుగురిపై కేసు

బెల్లంపల్లి: ఆస్తి తగాదాలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కన్నాల బస్తీకి చెందిన అడ్డూరి చిన్నరాములు సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. అతని మొదటి భార్య మృతి చెందడంతో పుష్పలత అనే మహిళను 22 ఏళ్ల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. గతేడాది అనారోగ్యంతో రాములు మృతి చెందాడు. తండ్రి ఆస్తిలో పుష్పలతకు వాటా దక్కకూడదని మొదటిభార్య కుమారులు శ్రీనివాస్, రాజన్న, కోడళ్లు సుజాత, రమ, కూతురు రాజేశ్వరి ఆమెను ఇంటినుంచి వెళ్లగొట్టేందుకు పలుమార్లు యత్నించారు. రెండు రోజుల క్రితం ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికునికి గాయాలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే 5 గనిలో కోల్ కట్టర్‌గా పనిచేస్తున్న రమేశ్ గురువారం ఉదయం షిఫ్ట్ విధులు ముగించుకుని మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్తుండగా గని సమీపంలో టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఘటనలో కార్మికుడి తల, చేతులకు గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఏరియా ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కలప తరలిస్తున్న కారు పట్టివేత

జన్నారం(ఖానాపూర్): జన్నారం రేంజ్ పరిధిలోని కిష్టాపూర్ నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న కారును పట్టుకున్నట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కిష్టాపూర్ నుంచి జన్నారం వైపు వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేయగా అందులో కలప దుంగలు లభ్యమైనట్లు తెలిపారు. కారు డ్రైవర్ పరారు కావడంతో కలపతో సహా కారును డివిజన్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. కలప విలువ రూ.25 వేలు ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): భార్య కాపురానికి రావడంలేదని ఒకరు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చింతలమానెపల్లి మండలం కర్జెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్జెల్లి గ్రామానికి చెంది న అన్నం భీమయ్య(35), అతని భార్య పోషక్కకు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భార్య కొద్ది రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన భీమ య్య గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.